క్లుప్తంగా

మెరుగైన విద్యాబోధన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో - 1 సామల

బలిజిపేట: స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్‌లో నూతన విద్యాబోధన అంశాలను నేర్చుకొని పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవో 1 సామల సింహాచలం సూచించారు. బలిజిపేట క్లస్టర్ కాంప్లెక్స్‌ల సమావేశాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్స్ ద్వారా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఉపాధ్యాయుల నైపుణ్యాలను పంచుకోవడం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

మక్కువ: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఎంపీడీవో ఎస్.అర్జునరావు అన్నారు. మండలంలోని కాశీపట్నం, చెముడు గ్రామాల్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సచివాలయాల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కల సంరక్షణతోనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎ.సింహాచలం ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధనలక్ష్మి కుంకుమ పూజలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన శంబర పోలమాంబ ఆలయంలో ధనలక్ష్మి కుంకుమ పూజలు ప్రముఖ రుత్విక్‌లచే ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొని అమ్మవారి దివ్యాశీస్సులు పొందాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

బలిజిపేట: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం వి.వెంకటినాయుడు అభినందించారు. డివిజన్ స్థాయిలో జరిగిన పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న దీవెన, అండర్ 17 విభాగంలో పదో తరగతి చదువుతున్న చరణ్ స్కూల్ గేమ్స్‌లో గెలుపొందారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొంది పాఠశాలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో బీవీ రమణ, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు తనిఖీలు



సుభద్రలో ఉచిత పశువైద్య శిబిరం

బలిజిపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీతానగరం ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. సుభద్రలో జిల్లా పశుగణ అభివృద్ధి సంస్థ, విజయనగరం వారి ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు అవసరమైన వైద్యసేవలను మనమే గుర్తించి వాటికి తగిన సంరక్షణ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమన్నారు. శిబిరానికి వచ్చిన వాటిలో 80 పశువులకు తనిఖీలు నిర్వహించి వాటికి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గణేష్, జి.కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై కోటి సంతకాల పోరు

- బినామీలకు దోచిపెట్టే కుట్ర
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్:

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థుల పాలిట శాపంగా మారుతుందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ కుటిల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాలు ప్రజా ఉద్యమాన్ని గ్రామ గ్రామాన రచ్చబండ కార్యక్రమంతో కూటమి కుట్రను ప్రజా క్షేత్రంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎనిమిదవ రోజైన శనివారం పార్వతీపురం మండలంలోని కె.ములగ, సంగంవలస గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది రాష్ట్ర ప్రజానీకానికి తీరని ద్రోహమని, కేవలం తమ వర్గాలకు దోచిపెట్టడం కోసమే కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ఈ కుట్రకు తెరలేపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న ఈ ప్రజా కోటి సంతకాల ఉద్యమానికి ప్రజలంతా స్వచ్ఛందంగా సంతకాలు చేసి ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామాల్లో కమిటీల నియామకాలు పూర్తి చేసి పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునే వరకు శ్రేణులంతా ఏకమై పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజావైద్యం ప్రజల హక్కు అని నమ్మిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిలో పది కళాశాలను ప్రైవేటుపరం చేస్తూ కేబినెట్ ఆమోదం తెలపడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, బి.రవికుమార్, కార్యదర్శి పోల సత్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, యాండ్రాపు తిరుపతిరావు, స్థానిక సర్పంచ్‌లు మడక కృష్ణవేణి, శ్రీరంజన్, బీసీ సెల్ నాయకుడు విశ్వనాథం, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు చప్ప శ్రీనివాసరావు, పెద్దింటి శ్రీనివాసరావు, సత్యంనాయుడు, కోటినాయుడు, బడే సత్యనారాయణ, ఎంపీటీసీ బడే రామారావు, సర్పంచ్ గండి శంకరరావు, మరి కొందరు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ప్రైవేట్ పరాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు చేస్తున్న స్థానిక మహిళలు

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



పార్టీ శ్రేణులతో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములునాయుడు

- పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములునాయుడు

సీతానగరం: క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని దయానిధిపురం, జానుమల్లువలస పంచాయతీల్లో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వంలో పార్టీ అనుబంధ శాఖల గ్రామ కమిటీలను శనివారం ఏర్పాటు చేశారు. జానుమల్లువలసలో ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కమిటీలు వేయడంతో పాటు కార్యకర్తలకు భరోసా కల్పిస్తామన్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కాశీపేట, అంటిపేట పంచాయతీల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని మండల స్థాయి నాయకులకు దిశ నిర్దేశం చేయడంతో కమిటీల నియామకం వేగవంతం చేశామన్నారు. జెడ్పీటీసీ ఎం.బాబ్జీ మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి గ్రామాల్లో స్థానిక సంస్థల నాయకులతో సమావేశాలు నిర్వహించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు వివరిస్తూ, జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు గుర్తు చేస్తామన్నారు. కార్యక్రమంలో గాదెలవలస, జానుమల్లువలస, చినంకలాం, ఎస్ఎస్‌పురం, సర్పంచ్‌లు బి.అన్నపూర్ణమ్మ, వై.వెంకటనాయుడు, పి.తిరుపతిరావు, దుర్గమ్మతో పాటు మాజీ సర్పంచ్‌లు వై.రాధాకృష్ణ, వై.జగన్నాధంనాయుడు, మండల నాయకులు శివున్నాయుడు, అప్పలనాయుడు, పారినాయుడు, గణేష్, వై.గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్షరంపై కక్ష కట్టడం సరికాదు

- సాక్షిపై దాడులకు నిరసన

సాలూరు: ప్రజాపక్షంగా నిలిచే పత్రికల గొంతు నొక్కేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన సాక్షి పత్రిక ఎడిటర్, రిపోర్టర్‌లపై కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 'పత్రికా స్వేచ్ఛను కాపాడాలని అన్నారు. అక్రమ కేసులతో దాడులు చేయడం హేయమైన చర్యన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బాలి విశ్వేశ్వరరావు, రాపాక కూర్మారావు, పలువురు విలేకరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు

ఉపాధి పనులు ఒంటి పూట పెట్టాలి

బలిజిపేట: ఉపాధి పనులు ఒంటి పూట పెట్టాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బలిజిపేట ప్రజా సంఘాల కార్యాలయంలో పీసా వెంకటస్వామి అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం 3వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి వెన్నెల వేణు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని పుచ్చలపల్లి సుందరయ్య స్థాపించారని నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ కార్మికుల సమస్యల కోసం నిరంతరం సంఘం పోరాడుతుందన్నారు. ఉపాధి వేతనదారులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుదల కావడంతో కార్మికులకు వచ్చే వేతనం సరిపోవటం లేదన్నారు. ఈ నెల 22వ తేదీన పార్వతీపురంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బలిజిపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.వెంకటస్వామి, కార్యదర్శిగా వి.వేణు, ఉపాధ్యక్షునిగా ఎస్.ఈశ్వరరావుతో సహా పలువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు జి.సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు, మండల నాయకుడు మన్మధరావు తదతరులు పాల్గొన్నారు.



ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వేణు

ప్రభుత్వ వైఫల్యాన్ని టీచర్లపై నెట్టడం సరికాదు...

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో వసతుల లేమి రాజ్యమేలుతుంటే ఆ నెపాన్ని ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి బోధకులనే బాధ్యులను చేస్తూ వేధించడం ఎంతవరకు సమంజసమన్నారు. సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు శూన్యంగా ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం లేదని ఆరోగ్యం పర్యవేక్షించేందుకు ఏఎన్‌ఎంల నియామకాలు చేపట్టడం లేదని ధ్వజమెత్తారు. ప్రతీ వైఫల్యానికి ఉపాధ్యాయులను బలిపశువులను చేయడం సరికాదన్నారు.

గురువులను బాధ్యులను చేయడం సరికాదు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులపై మోపడాన్ని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అధికారుల నిర్ణయంపై ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముvvల అమర్నాధ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను బాధ్యులను చేసే ముందు వసతిగృహాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, కొరతగా ఉన్న సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పౌష్టికాహారంతో కూడిన మెనూ అమలు కావాలంటే ముందు మెస్ చార్జీలు పెంచాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని అన్నారు.

తాగునీటి సమస్యపై ధర్నా



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెద్దింపేట గ్రామస్తులు

బలిజిపేట: పెద్దింపేటలో ప్రజలు దాహం కేకలతో అలమటించుకుపోతున్నామని గ్రామస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు బలిజిపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. 300 మందితో సంతకాలు చేయించి అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో తాగడానికి నీరులేదని, ఎక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోవాలనుకున్నా అవకాశాలు లేకపోవడంతో ప్రజలు అలమటించుకుపోతున్నామన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం లేదన్నారు. బోర్లు ఉన్నప్పటికి వాటి నుంచి ఉప్పు నీరు, కలుషిత నీరు వస్తుందని, తప్పని పరిస్థితులో వాటినే తాగుతున్నామని దీనివలన అనారోగ్యం పాలవుతున్నామన్నారు. తక్షణమే రక్షిత మంచినీరు అందించాలని కోరారు. స్థానికంగా సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని గ్రామస్తులు తెలిపారు. దీనిపై ఎంపీడీవో శ్రీవాణి పదిరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మన్మధరావు, జి.సత్యనారాయణ, వెంకటస్వామి, ఎస్.ఈశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మిక పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు అన్నారు. మండల కేంద్రంలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో కార్మికులుగా ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసి, ఇతర కారణాలు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి నెలకు రూ.10 వేలు వంతున పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఈ ప్రాంతంలోఎక్కువ మంది సుగర్ ఫ్యాక్టరీ, జూట్ మిల్లు, ఆర్టీసీ డిపోల్లో విధులు నిర్వహించే కార్మికులు శ్రమతో పీఎఫ్ కింద యాజమాన్యాలు పీఎఫ్ అకౌంటులో జమ చేయడం లేదని ఆరోపించారు. ఈపీఎస్ పెన్షన్ రాకుండా యాజమాన్యాలకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్.రాము మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కార్మికులకు పెన్షన్ ఇవ్వకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కారణంగా తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న 104 జిల్లా మేనేజరు

సీతానగరం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్న 104 సంచార వైద్య సేవా వాహనాల ద్వారా గ్రామాల్లో రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా మేనేజరు ఎస్.కృష్ణ అన్నారు. 104 వాహనాలు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా శనివారం పెదంకలాం పీహెచ్‌సీలో 104 వాహనాన్ని, వాహనంలో మందుల నిల్వలు, యంత్ర కండీషన్, రికార్డులను తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనంలో వైద్య పరీక్షలకు ఏర్పాటు చేసిన ఎక్విప్‌మెంట్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో వైద్యాధికారి పర్యవేక్షణలో వ్యాధి నిరోధక పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి.. ఆరోగ్యానికి రక్ష

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



దోకిశీల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా. ఎస్.భాస్కరరావు

పార్వతీపురం రూరల్: ఆరోగ్యవంతమైన జీవనానికి స్వచ్ఛమైన గాలి ఎంతో కీలకమని, ప్రతీ ఒక్కరూ పర్యావరణహిత మార్గాలను అనుసరించాలని డీఎంహెచ్‌వో డా.ఎస్.భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ నెల సారాంశం. 'క్లీన్ ఎయిర్' లో భాగంగా శనివారం డోకిశీల పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమ వసతిగృహంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో వాయు కాలుష్యం పెరిగిపోతుందన్నారు. కలుషిత గాలి వల్ల శ్వాసకోశ సమస్యలతో పాటు అనారోగ్యాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు, చెట్లు పెంచడం, ప్రత్యామ్నాయ ఇంధనాలు, సౌరశక్తి వినియోగం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని సూచించారు. అనంతరం ఆయన ఆస్పత్రి వసతిగృహ పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డా.టి.జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ ఆస్పత్రులు, వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉత్తమ విధానాలు పాటించిన రెండు పీహెచ్‌సీలు స్వచ్ఛ అవార్డులు గెలుచుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఐవో డా. విజయమోహన్, వైద్యులు డా.స్నిగ్ధ, సూపర్‌వైజర్ జయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ విద్యతో ఆరోగ్యం



మాట్లాడుతున్న పీడీ వైకుంఠం

సీతానగరం: వ్యాయామ విద్య ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం కలగడంతో పాటు క్రమశిక్షణ కలిగే విధంగా తయారు చేయాలని పీడీ, కోర్సు డైరెక్టర్ వైకుంఠం అన్నారు. మండలంలోని జోగింపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమావేశ మందిరంలో ఆరు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుల, అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం ఎంఈవో ఎం.వెంకటరమణ అధ్యక్షతన శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న వైకుంఠం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ప్రారంభంలో ప్రార్థన సక్రమంగా నిర్వహించాలని, ఫిట్‌నెస్‌ను పెంపొందించేందుకు యోగా విద్యను బోధించాలని, సమయపాలన పాటించేలా చూడాలన్నారు. సాధారణ విద్య పట్ల ఆకర్షితులు అయ్యేందుకు ఏకాగ్రత కలిగేలా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరు మండలాల పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

- ఒంటి కాలిపై వినూత్న నిరసన



కలెక్టర్ ఎదుట ఒంటి కాలిపై వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పార్వతీపురం రూరల్:

గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో విద్యార్థుల వరుస మరణాలకు నిరసనగా, వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు ఒంటి కాలిపై నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా సభ్యులు పి.సంగం మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో తక్షణమే ఏఎన్‌ఎంలను నియమించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని సభలో మరణించిన వ్యక్తికి పరిహారం ఇచ్చిన ప్రభుత్వం, గిరిజన విద్యార్థులు చనిపోతే ఎందుకు మొండికేస్తోందని వారు నిలదీశారు.

గిరిజనులకు సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం, వైద్యం అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గిరిజన, విద్యా శాఖ మంత్రులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు సాయం చేశారని, ఇప్పటి పాలకులు కనీసం జాలి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలో గౌరీశ్వరి, రమణమ్మ, చంద్రకళ, నక్షత్ర, రాజేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పార్వతీపురం / సాలూరు

9010204441, 9951602891

Office mail : vzmadvt@gmail.com

గిరిజనులకు అన్యాయం చేయొద్దు..: సీపీఎం



చదును చేసిన ప్రాంతంలో సీపీఎం జెండాలను ఏర్పాటు చేస్తున్న స్థానిక గిరిజనులు, సీపీఎం నాయకులు

పార్వతీపురం రూరల్: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న కొండ పోడు భూములకు పట్టాలివ్వమంటే కాళ్లరిగేలా తిప్పుకొంటున్న అధికారులు, అధికార పార్టీ నాయకులకు మాత్రం రిజర్వ్ ఫారెస్ట్ భూములను అప్పనంగా కట్టబెడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కద్రక రామస్వామి, పాలమెట్ట రాము ఆరోపించారు. మండలంలోని జమదాల పంచాయతీ పరిధిలోని పొట్టి గదబవలస, లక్ష్మీపురం తదితర గ్రామాల గిరిజనులు ఈ సమస్యపై శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ హక్కు చట్ట ప్రకారం గిరిజన కుటుంబానికి పదెకరాలు ఇవ్వాల్సి ఉండగా 50 సెంట్లు, ఎకరా భూమిని మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ అటవీ భూముల ఆక్రమణలకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే జమదాల పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తికి 20 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కట్టబెట్టారని, అందులోని టేకు, నీలగిరి చెట్లను నరికి, మొదళ్లను సైతం తొలగించి చదును చేశారని, ఆ భూమి చుట్టూ కంచె వేస్తుండగా పొట్టి గదబవలస గ్రామస్తులు అడ్డుకున్నారని తెలిపారు. ఆదివాసీలపై దాడులు చేసే అధికారులు అధికార పార్టీ నాయకులకు మాత్రం మినహాయింపు ఇస్తున్నారని, దీనివల్ల అటవీ సంపద అంతరించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మక్కువ బీటు, సాలూరు రేంజ్ అధికారులతో కుమ్మక్కైన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని, ఆ భూమిని పేద ఆదివాసీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ భూమిని ఆక్రమించి గిరిజనులకు పంపిణీ చేస్తామని, ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కె.శంకరరావు, నాగరాజు, సూర్యనారాయణ, పి.రమణారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.